క్లుప్తంగా

తాగునీటికి కటకట..



మరమ్మతులకు గురైన మోటారును చూపుతున్న శివజ్యోతినగర్ వాసులు

తిరుపతి మంగళం : తిరుపతి నగర నడిబొడ్డులో ఉన్న శివజ్యోతినగర్‌లో తాగునీటి కోసం స్థానిక ప్రజలు కటకటలాడుతున్నారు. ఇక్కడ సాయిబాబా ఆలయం సమీపంలో ఉన్న తాగునీటి మోటర్ బోరు ద్వారానే ఆ ప్రాంత వాసులకు తాగునీటి సరఫరా అవుతుంది. రెండు రోజులకు, నాలుగు రోజులకు వచ్చే తెలుగు గంగ నీటినే కాకుండా ఆ మోటార్ బోరు ద్వారా వచ్చే నీటితోనే సుమారు రెండు వందల కుటుంబాల వారు అవసరాలు తీర్చుకుంటున్నారు. అయితే గత నెల రోజులుగా మోటా రు మరమ్మతులకు గురైంది. మోటారుకు మరమ్మతులు చేయించాలని స్థానికులు సచివాల య సిబ్బంది, కార్పొరేషన్ అధికారులకు అనేక మార్లు విన్నవించుకున్నారు. కానీ ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి కోసం పక్క వీధుల్లోకి వచ్చే ట్యాంకర్ల ద్వారా తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి తాగునీటి మోటార్‌కు మరమ్మతులు చేయించి తాగునీటి సమస్య తీర్చాలని వేడుకుంటున్నారు.

కియా గ్రావిటీ రేంజ్ కారు ఆవిష్కరణ



కియా గ్రావిటీ రేంజ్ కారును ఆవిష్కరిస్తున్న షోరూం ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: చెన్నై–బెంగళూరు రహదారిలోని హిరోషి ఆటో ప్రైవేటు లిమిటెడ్ కియా షోరూంలో కొత్త ×ద కియా గ్రావిటీ రేంజ్ కారును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షోరూం మేనేజింగ్ డైరెక్టర్ సి.జగన్నాథరెడ్డి మాట్లాడుతూ కియా నుంచి ప్రస్తుతం సరికొత్తగా అత్యాధునిక ఫీచర్లతో ది కియా గ్రావిటీ రేంజ్ కార్లను అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో షోరూం డైరెక్టర్లు సి.నిరంజన్, సి.భారతి, సి.హిరోషియారెడ్డి, సిబ్బంది, పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో జస్టిస్ కిరణ్మయి



తిరుచానూరు ఆలయం వద్ద హైకోర్టు జడ్జి కిరణ్మయి

తిరుపతి రూరల్: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.కిరణ్మయి కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయాధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి ప్రసాదాలను అందించారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

తిరుపతి తుడా: ఈద్ మిలాద్ ఉన్ నబీ పర్వదినం సందర్భంగా ప్రభుత్వ సెలవు కావడంతో 16వ తేదీ సోమవారం ×ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక్ష (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సోమవారం కార్యాలయానికి వినతులతో రావొద్దన్నారు.

సవాళ్లను ఎదుర్కొని సత్తా చాటాలి



సమావేశంలో పాల్గొన్న మహిళలు

పాకాల : సమాజంలో ఎదురవుతున్న వివక్ష, అసమానతలు, పనిచేసే చోట దాడులు తదితర వాటిని ఎదుర్కొంటూనే మహిళలు ఆత్మస్థైర్యంతో అన్నింటా సత్తా చాటాల్సిన అవసరం ఉందని రెవరెండ్ జెన్సీ పాల్విన్ ప్రనిధి(చిన్నంపల్లె పాస్టేట్) అన్నారు. ఆదివారం స్థానిక సీఎస్ఐ చర్చిలో ఆరాధన కార్యక్రమం, ఉమెన్ సండే కార్యక్రమాలు నిర్వహించారు. ఉమెన్స్ పార్టనర్‌షిప్ ఇన్ గాడ్స్ లిబరేటివ్ యాక్ట్, సమాజంలో స్త్రీల పాత్ర అనే అంశాలపై గెస్ట్ స్పీకర్‌గా పాల్విన్ ప్రసంగించారు. ద్వేషించే శక్తులను సమైక్యత, సహృద్భావంతో మనవైపు తిప్పు కోగిలిగితే సమాజంలో అశాంతికి స్థానం ఉండదన్నారు. కార్యక్రమంలో రెవరెండ్ ప్రేమ్‌కుమార్, ఉమెన్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ జోషి కార్యదర్శి కె.విమలా విక్టోరియా, కోశాధికారి ప్రియాప్రషిభ, సీఎస్ఐ చర్చి సెక్రటరీ విక్టర్ రఘువేల్, ట్రెజరర్ అరుళ్ సెల్వి సభ్యులు పాల్గొన్నారు.

ఆశలు అడియాశలవుతున్నాయి..



ఉన్నత విద్యను అభ్యసించి భవిష్యత్తులో అత్యున్నత స్థాయికి చేరుకోవాలన్న పేద విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షలా మారుతోంది. ప్రతి పేద విద్యార్థికి ఉన్నత విద్యను అందించాలన్న సంకల్పంతో గత ప్రభుత్వం అనేక మెడికల్ కళాశాలల ఏర్పాటుకు కృషి చేసింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేసి పేద విద్యార్థుల ఆశలను అడియాశలు చేస్తోంది. మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేస్తే వైద్య విద్యను కొనుక్కొని చదువుకునే పరిస్థితి పేద విద్యార్థులకు లేదు.

– పి.గోపిచంద్, విద్యార్థి తిరుపతి



ఆశలపై నీళ్లు చల్లకండి..



రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన మెడికల్ కళాశాలల ద్వారా నీట్‌లో మంచి ర్యాంకులు సాధించిన రాష్ట్ర విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ఈ ఏడాది ఎంతోమంది విద్యార్థులు రాష్ట్రంలోనే సీట్లు సాధించి వైద్య విద్యను అభ్యసించవచ్చని ఆశపడ్డారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వైద్య విద్యను అభ్యసించాలనుకున్న పేద విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లినట్లు అవుతుంది. ప్రభుత్వం ఆలోచించి మంచి నిర్ణయం తీసుకోవాలి.

– పి.సాయిగణేష్, విద్యార్థి తిరుపతి

ట్రెండ్ సెట్టర్స్..

మహిళలు వంటింటి కుందేళ్లు అనేది ఒకప్పటి మాట.. నేడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా స్త్రీలు రాణిస్తున్నారు. మగవారికి ధీటుగా సంపాదిస్తూ మహిళలే మహారాణులని నిరూపించుకుంటున్నారు. నేటితరం యువత ఆర్థిక స్వావలంబన సాధిస్తూ మహిళా లోకానికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

- స్వయం ఉపాధిలో దూసుకుపోతున్న మహిళలు
- పురుషులతో సమానంగా సంపాదన
- కుటుంబ పోషణలో అతివల బాధ్యత అమోఘం
- నేటి ఆధునిక ప్రపంచంలో పోటీ పడి రాణిస్తున్న వైనం



వివిధ కళా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్న యువతులు

తిరుపతి గాంధీ రోడ్: నేటి ఆధునిక తరంలో పెళ్లిళ్లు కూడా చాలా మోడ్రన్ పద్ధతిలో జరుగుతున్నాయి. పెళ్లి కూతుర్ల తలకు అలంకరించే పూలు.. మెడలో వేసుకునే పూలమాలలు అన్ని కూడా చాలా లేటెస్ట్‌గా ఉంటున్నాయి. వీటిని కూడా ఒక అందమైన డిజైన్లతో తీర్చిదిద్దే వారికి మంచి డిమాండ్ ఉంటుంది. ఒక పెళ్లికి పూల డెకరేషన్ తీసుకున్న కూడా సుమారు ఖర్చులు అన్నీ పోయి రూ.20 వేలు పైగానే మిగులుతాయి. అంతేకాకుండా పెళ్లి చేసుకునే వారు కోరిన పూలను సెలెక్ట్ చేసుకుంటారు. దాని ప్రకారమే ధరలు కూడా నిర్ణయిస్తారు. అంతేకాకుండా పెళ్లికూతురికి ఫ్లవర్స్‌తో తయారు చేసిన అందమైన అర్నమెంట్స్‌ను కూడా తాత్కాలికంగా తయారు చేస్తారు.

కలంకారీతో మంచి ఉపాధి

నేటి ఆధునిక యుగంలో మహిళలు కలంకారీ(ఇమిటేషన్) పనులపై ఎక్కువ మక్కువ చూపుతున్నారు. దీంతో ఇది కూడా మంచి ఉపాధి సదుపాయంగా మారింది. మహిళలు వాల్ హ్యాంగింగ్స్, శారీలు, బ్లౌజు, కుర్తీపైన కలంకారీ ఇమిటేషన్ వర్క్ చేస్తున్నారు. షాపుల వారు కూడా ఇవి పెద్దమొత్తంలో ఆర్డర్లు ఇస్తున్నారు. వీటిపై మహిళలకు ఇంట్రెస్ట్ ఎక్కువ ఉంటుంది. వీటితో తయారు చేసినవి గిఫ్ట్ రూపంలో కూడా అందిస్తున్నారు. వారు తయారు చేసిన కలంకారీ పని పైన ఖర్చు పెట్టిన దానికన్నా అధిక ఆదాయం లభిస్తుంది.

క్లేతో అందమైన డిజైన్లు

క్లేతో అందమైన డిజైన్లు చేసుకోవచ్చు. ఇది కూడా స్వయం ఉపాధిలాగా మహిళలకు ఉపయోగపడుతుంది. ఇంట్లో అలంకరించే వస్తువులన్నిటి పైన కూడా ఈ క్లే వర్క్ చేసుకోవచ్చు. వీటిని బాటిళ్లపై, కుండలపై, ఫ్లే జ్యువెలరీని సైతం తయారు చేసుకోవచ్చు. వీటిని తయారు చేసి షాప్‌లో పెట్టి విక్రయిస్తే మంచి లాభాలే వస్తాయి.

తక్కువ ధరలో తంజావూరు పెయింటింగ్

ఒరిజినల్ తంజావూరు పెయింటింగ్స్ అయితే చాలా ఎక్కువ ధర అవుతుంది. మనం చేసే ఎస్టిమేషన్ తంజావూరు పెయింటింగ్ వర్క్స్ చాలా తక్కువ ధరకే వస్తాయి. సామాన్య వ్యక్తులు కూడా ఈ వర్క్‌ను వినియోగిస్తున్నారు. దీనిని బ్లౌజులపై వేయడం ఇప్పుడు ప్రత్యేక ట్రెండ్. దీనిపై అధిక లాభాలు వస్తున్నాయి. అంతేకాకుండా వాల్‌పై ఉంచే ఫ్రేమను సైతం తక్కువ ధరలకే తయారు చేసి అధిక ధరలకు విక్రయించి లాభాలు ఆర్జించవచ్చు.

తక్కువ ఖర్చు..ఎక్కువ లాభం

పూర్తిగా దుస్తులపై చేసే పెయింటింగ్ వర్క్‌ను ఫ్యాబ్రిక్ పెయింటింగ్ అంటారు. ఇందులో చాలా తక్కువ ఖర్చు చేసి ఎక్కువ లాభాలు ఆర్జించవచ్చు. ఇందుకోసం ఫ్యాబ్రిక్ పెయింట్స్ బ్రష్‌లు మాత్రమే ఉపయోగిస్తారు. ఇందులో కొన్ని టెక్నికల్ ఉపయోగించి రూపొందిస్తారు. ప్రస్తుతం ఆంధ్రలో ఇది ట్రైనింగ్ నడుస్తుంది. వీటిపైన మహిళలు చాలా మక్కువ చూపిస్తున్నారు.



క్లే వర్క్ చేస్తున్న మహిళలు

మహిళల ఆసక్తి..



నేటి మహిళలు స్వయం ఉపాధి కోసం పెద్దఎత్తున పెట్టుబడి లేని వ్యాపారం ఎంచుకుంటున్నారు. అందులో భాగంగానే స్వయం ఉపాధి పనులు నేర్చుకుంటున్నారు. మా వద్ద ఇప్పటికే చాలామంది ట్రైనింగ్ పొందారు. వారు ఇప్పుడు షాపులు పెట్టుకుని మహారాణులుల్లా బతుకుతున్నారు.

– కే.హరిణి, ట్రైనర్



కలంకారీ వర్క్ చేస్తున్న యువతులు



పూలతో అందమైన డిజైన్లు చేస్తున్న మహిళలు



వస్త్రాలపై పెయింటింగ్ వేస్తున్న మహిళలు

హక్కుల పరిరక్షణే లక్ష్యం



నియామక పత్రం అందుకుంటున్న రేవతి

తిరుపతి కల్చరల్ : సామాన్య ప్రజల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా కృషి చేస్తానని ఫోరం ఫర్ ఆర్‌టీఐ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.రేవతి తెలిపారు. ఆదివారం తిరుపతిలోని దొడ్డాపురంలో ఉన్న సంస్థ కార్యాలయంలో కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోరం ఫర్ ఆర్‌టీఐ జాతీయ సహాయ కార్యదర్శి కె.అజయ్‌ప్రసన్నకుమార్ చేతుల మీదుగా రేవతికి నియామక పత్రం అందించారు. ఆమె మాట్లాడుతూ నిస్వార్థంతో తాము అందిస్తున్న సేవలను గుర్తించిన సంస్థ జాతీయ ,రాష్ట స్థాయి నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కె.ప్రసాద్, గుణ, కిరణ్, చంద్రశేఖర్, శివమూర్తి, శ్రీధర్ ,శ్రీను, సాంబ పాల్గొన్నారు.

అంబరం.. గణేశ్ నిమజ్జనం



పాకాల: మండల కేంద్రంలోని న్యూకాలనీలో ఏర్పాటు చేసిన వినాయకస్వామి విగ్రహ నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. ఆదివారం వేకువజామున నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు అర్చనలు, హోమం వంటి పూజలు చేశారు. అలాగే స్వామి విగ్రహం ముందు నిర్వహించిన ఉట్లోత్సవంలో స్థానిక యువత పాల్గొన్నారు. స్వామివారిని సుందరంగా అలంకరించి పట్టణంలోని పురవీధుల్లో ఊరేగించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో స్వామివారిని ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందించిన అనంతరం సమీపంలోని చెరువులో స్వామివారి విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

తిరుపతి(అలిపిరి): టీటీడీలో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయీబ్రాహ్మణ ఉద్యోగుల సాంస్కృతిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో టీటీడీ ఈఓ జె.శ్యామలరావు, జేఈఓ వీరబ్రహ్మంను కలిసి వినతి పత్రం అందించారు. టీటీడీలోని కల్యాణకట్ట, వివిధ శాఖలు, టీటీడీ ఇతర అనుబంధ ఆలయాలలో విధులు నిర్వహిస్తున్న నాయీబ్రాహ్మణ ఉద్యోగులు సమస్యలపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. తిరుపతిలోని మ్యూజిక్, డ్యాన్స్ కళాశాలలో ఖాళీగా ఉన్న డోలు, నాదస్వరం, తాళం, శృతి పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. మునిబాలకుమార్, మల్లికార్జున, మల్లిఖార్జున, కామరాజు, సత్యనారాయణ, ప్రసాద్, బాలసుబ్రహ్మణ్యం, మునిశంకర్, నాగరాజు, ఎంఎస్ కృష్ణ పాల్గొన్నారు.



టీటీడీ ఈఓ శ్యామలరావుకు వినతిపత్రం అందిస్తున్న టీటీడీ నాయీ బ్రాహ్మణ ఉద్యోగులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



శిల్పారామంలో కళాకారుల నృత్య ప్రదర్శనలు

తిరుపతి రూరల్: తిరుపతి శిల్పారామం కళావేదికపై ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి కళాతరంగణి సంస్థ కళాబృందం జానపద, సినీ జానపదం, భక్తిగీతాలు, నృత్యాలు ఉర్రూతలూగించాయి.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శన



వేమూరు ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో మెక్సికన్ వ్యవసాయ బృంద సభ్యులు

తిరుపతి రూరల్: తిరుపతి జిల్లా వేమూరు గ్రామంలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో మెక్సికో అధికారుల బృందం ఆదివారం పర్యటించారు. మెక్సికన్ వ్యవసాయ పరిశోధకులు ఎలిజోండ నిల్డ, లోపేజ్‌మెర్లిన్, వ్యవసాయ ఉత్పత్తిదారులు లోపేజ్‌కామెల్, ఆర్టేజ్ ఫ్లోర్స్‌మారియతో పాటు 13 మంది సభ్యులు కలిగిన బృందం ఏపీ వ్యవసాయశాఖ సలహాదారు, రైతు సేవా సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ కుమార్ ఆధ్వర్యంలో ఆదర్శ రైతు అయ్యప్ప నాయుడు పొలంలో ప్రకృతి వ్యవసాయ ఇన్‌పుట్స్‌పై డెమో రూపంలో వివరించారు. బీజామృతం, ఘనజీవామృతం, ద్రవ జీవామృతం, విత్తన గుళికలు తయారీ గురించి కావలసిన వస్తువులను చూపిస్తూ వాటి తయారీ విధానాన్ని ప్రయోగాత్మకంగా చూపించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండిస్తున్న ఏటీఎం మోడల్ రకాల పంటలను బయోడైవర్సిటీని వారు ప్రత్యక్షంగా పరిశీలించారు. మల్బరీ పంటలలో అనుసరిస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలను అడిగి తెలుసుకున్నారు.

మహిళలతో ముఖాముఖి

రామచంద్రాపురం: మండలంలోని సీరామాపురంలో గల ధర్మరాజుల ఆలయ ప్రాంగణంలో ఆదివారం మహిళా సంఘ సభ్యులతో మెక్సికో బృందం ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘ సభ్యులు పెరటి తోట పెంపకం ద్వారా చేకూరే లబ్ధిని అడిగి తెలుసుకుని మెక్సిక్ బృందానికి తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



పవిత్రాలను తెస్తున్న అర్చకులు, అధికారులు

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి పవిత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ చేపట్టారు. ఉదయం స్వామివారిని సుప్రభాతం, తోమాలసేవ చేపట్టారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామివారి ఉత్సవర్లను యాగశాలకు వేంచేపు చేశారు. ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం, అలాగే మూలవర్లకు, ఉత్సవర్లకు, ఉప ఆలయాలకు, పరివార దేవతలకు, ధ్వజస్తంభానికి, శ్రీమఠం ఆంజనేయ స్వామి వారికి పవిత్రాలు సమర్పించారు.

శాస్త్రోక్తంగా పవిత్రాల సమర్పణ





పవిత్రాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న చెవిరెడ్డి రఘునాథరెడ్డి దంపతులు, అభిషేకం చేస్తున్న రుత్వికులు

- కల్యాణ వెంకన్న ఆలయంలో వైదిక క్రతువులు
- పెద్దఎత్తున పాల్గొన్న భక్తులు

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ పవిత్రోత్సవాల్లో భాగంగా రెండవ రోజు ఆదివారం పవిత్ర సమర్పణ శాస్త్రోక్తంగా జరిగింది. ఇందులో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి తోమాలసేవ, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం సీతాలక్ష్మణ సమేత శ్రీరాములవారి ఉత్సవర్లను యాగశాలకు వేంచేపు చేశారు. అక్కడ విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, కుంభారాధన, ఉక్తహోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజన సేవ వేడుకగా జరిగింది. ఇందులో ఉత్సవమూర్తులను పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకం చేశారు. అనంతరం యాగశాలలో పవిత్రమాలలకు ఉపచారాలు నిర్వహించి ప్రదక్షిణగా సన్నిధికి వేంచేపు చేశారు. ధ్రువమూర్తులు, కౌతుకమూర్తులు, స్నపన మూర్తులకు బలిమూర్తులకు పవిత్రాలు సమర్పించారు. అదేవిధంగా విష్వక్సేన, ద్వారపాలకులు, భాష్యకార్లు, గరుడాళ్వార్, యాగశాలలోని హోమగుండాలు, బలిపీఠం ధ్వజస్తంభం, ఆలయం ఎదురుగా గల ఆంజనేయ స్వామివారికి పవిత్రాలు సమర్పించారు. సాయంత్రం శ్రీ సీతారామ లక్ష్మణులు బంగారు తిరుచ్చిపై ఆలయ మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఆ తరువాత యాగశాలలో వైదిక కార్యక్రమాలు చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సోదరుడు చెవిరెడ్డి రఘునాథ రెడ్డి దంపతులు, ఈఓ నల్లందుల సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, సమాచార శాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లా, కృతిక్ శుక్లా ఐఏఎస్ ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

మోక్షగుండం సేవలు ఆదర్శనీయం



ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో మోక్షగుండం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

తిరుపతి రూరల్: నేటితరం ఇంజినీర్లకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు ఆదర్శనీయమని ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష రావు తెలిపారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరాయ జయంతి సందర్భంగా ఆదివారం తిరుపతి ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోక్షగుండం ఇంజినీరుగా అనేక నిర్మాణాత్మక పనులను చేపట్టి ప్రజల మదిలో శాశ్వతంగా నిలిచారన్నారు. రోజుకు 18 గంటలపాటు పనిచేసిన ఆయనను అప్పట్లో భారత ప్రభుత్వం భారతరత్న బిరుదుతో గౌరవించిందన్నారు. దేశంలోని 8 విశ్వవిద్యాలయాలు ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసి గౌరవించాయన్నారు. విద్యుత్ రంగ ఇంజినీర్లు మోక్షగుండం అడుగుజాడల్లో నడుస్తూ, ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ అయూబ్ ఖాన్, అధికారులు పాల్గొన్నారు.

గంధమనేని భవన్‌లో..

తిరుపతి తుడా: స్థానిక గంధమనేని శివయ్య భవన్‌లో అసోసియేషన్ అధ్యక్షుడు మట్టి ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో ది అసోసియేషన్ ఆఫ్ వాసర్స్ అండ్ ఇంజినీర్స్ నేతృత్వంలో ఇంజినీర్స్ డేని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తుడా ముఖ్య ప్రణాళిక అధికారి దేవికుమారి హాజరయ్యారు. అనంతరం వాసన్ ఐ కేర్ ఆధ్వర్యంలో కంటి ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు.

మోక్షగుండంకు నివాళులు



బీజేపీ నేతల ఆధ్వర్యంలో..

తిరుమల: ఇంజినీర్స్ డే సందర్భంగా నగరంలోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

ఘనంగా ఇంజినీర్స్ డే

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఇంజినీర్స్ డేని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ రిటైర్డ్ ప్రిన్సిపల్ కేవీఎల్ నారాయణ, ఏపీఎస్పీడీసీఎల్ రిటైర్డ్ సీఎండీ గోపాల్‌రెడ్డి విచ్చేశారు. రిటైర్డ్ ఎస్ఈ దేవేంద్రనాథ్‌రెడ్డి, ప్రొఫెసర్ వీరారెడ్డి, సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



ఇంజనీర్స్ డేలో పాల్గొన్న అతిథులు, అధ్యాపకులు

రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా పాలన



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎంపీ గురుమూర్తి

తిరుపతి(అలిపిరి): రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగానే ప్రభుత్వ పాలన ఉంటోందని.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిరంతరం ప్రజల కోసం పని చేస్తున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం తిరుపతిలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో చాంబర్ ఆఫ్ కామర్స్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయానికి కావాల్సిన స్థలాన్ని మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా చాంబర్ కామర్స్ సభ్యులు రక్తదానం చేశారు. బీజేపీ నాయకులు భానుప్రకాష్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మోహన్ రాజు, పలు యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న



భక్తులకు దర్శనమిస్తున్న కల్యాణ వెంకటేశ్వరస్వామి

తిరుపతి రూరల్(శ్రీనివాసమంగాపురం): శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం లక్ష్మి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న స్వామివారు బంగారు తిరుచ్చిపై ఆలయ మాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్, అధికారులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.